క్లుప్తంగా

జీలుగు చెట్ల పెంపకంలో గిరిజనుల ప్రత్యేక శ్రద్ధ


పూతికవలసలో పొలం గట్లపై గిరిజనులు పెంచుతున్న జీలుగు చెట్లు

సాలూరు రూరల్: మండలంలోని ఏజెన్సీ గ్రామాల గిరిజనులు జీలుగు చెట్ల పెంపకంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. జీలుగు చెట్ల నుంచి వేసవికాలంలో కల్లు తీసి అమ్మకాలు చేస్తుంటారు. గిరిజనులు సహజ సిద్ధగా కొండలపై పెరిగే చెట్ల నుంచి జీలుగు కల్లు తీసి గతంలో అమ్మకాలు చేసేవారు. అయితే ఈ మధ్య కాలంలో కొండలపై పెరిగే మొక్కల శాతం గణనీయంగా తగ్గిపోవడంతో గిరిజనులు వారు వ్యవసాయం చేసే పోడుభూముల్లో గట్టుపై ప్రత్యేకంగా జీలుగుమొక్కలు నాటి పెంచుతున్నారు. వాటిద్వారా వేల రూపాయలు ఆదాయం వస్తుందని ఈ కల్లు తాగిన వారికి శరీరంలో వేడి నియంత్రణలో ఉంటుందని గిరిజనులు చెబుతున్నారు. జీలుగు చెట్ల పెంపకంతో కొన్ని కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి.

మండలాఫీసులో పారిశుద్ధ్య పనులు


మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న వేతనదారులు

సీతానగరం: స్థానిక మండలపరిషత్ కార్యాలయం ఆవరణలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ భాను శుక్రవారం పారిశుద్ధ్య పనులు చేయించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు మాట్లాడుతూ నిరంతరం ప్రజలతో కళకళలాడుతూ, విశాలంగా ఉన్న మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో చెత్త పేరుకుపోవడంతో ఉపాధి వేతనదారులతో చెత్తకుప్పలను తొలగించామని చెప్పారు. అలాగే కార్యాలయం వెనుక భాగంలో పెంచిన మొక్కలచుట్టూ కలుపు నివారణ చర్యలు చేపట్టామని, గడ్డిమందు చల్లడంతో పాటు దోమల నివారణమందు పిచికారీ చేయనున్నట్లు చెప్పారు. పిచ్చిమొక్కలను తొలగించి దూరప్రాంతాలకు తరలించినట్లు తెలిపారు. కార్యాలయం చుట్టూ క్యారీఫాల్స్ వేసి పిచ్చిమొక్కల నివారణకు మందులు వేస్తున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో ఈసీ కృష్ణ, టీఏలు పాల్గొన్నారు.

అప్పయ్యపేట సబ్‌స్టేషన్‌లో పెట్రోలింగ్


ట్రాన్స్‌ఫార్మర్ల పనులను పరిశీలిస్తున్న ఏఈ జగన్మోహనరావు

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో తరచూ విద్యుత్ సరఫరాలో ఏర్పడుతున్న అంతయాన్ని నివారించడానికి వీలుగా శుక్రవారం 33/11 కేవీ విద్యుత్ లైన్లు, ప్రధాన ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేశామని ఏపీఈపీడీసీఎల్ ఏఈ జగన్మోహన్‌రావు అన్నారు. ఈ మేరకు ఈదురుగాలులకు చెట్లు వైర్లపై పడిపోవడం వల్ల మండలంలోని విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. ఈ నేపథ్యంలో పార్వతీపురం నుంచి సీతానగరం మండలంలోని అప్పయ్యపేట సబ్‌స్టేషన్ వరకూ పవర్‌లైన్ పెట్రోలింగ్ చేపట్టినట్లు చెప్పారు. అలాగే అప్పయ్యపేట నుంచి బూర్జ సబ్‌స్టేషన్ వరకూ పెట్రోలింగ్ చేశామని తెలిపారు. గ్రామాలలో ఏవైనా విద్యుత్ అంతరాయం ఏర్పడిందంటే సిబ్బంది బాధ్యతవహించాల్సి ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సబ్ ఇంజినీరు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తుప్పల తొలగింపు


కవిరిపల్లిలో వాటర్‌ట్యాంక్ చుట్టూ తుప్పలు తొలగిస్తున్న దృశ్యం

మక్కువ: మండలంలోని కవిరిపల్లి గ్రామంలో రక్షితమంచినీటి పథకం చుట్టూ పేరుకుపోయిన తుప్పలను పంచాయతీ కార్యదర్శి సీత ఆధ్వర్యంలో శుక్రవారం తొలగించారు. ఇటీవల వర్షాలు కురవడంతో తాగునీటి వనరుల చుట్టూ పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. తాగునీరు కులుషితం కాకుండా ముందుస్తు చర్యల్లో భాగంగా బోరుబావులు, రక్షితమంచినీటి పథకాలు శుభ్రం చేయిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి సీత తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం
- ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో పాల్గొన్న ఐటీడీఏ పీఓ
- విద్యాశాఖ ఆధ్వర్యంలో పెదబొండపల్లిలో కార్యక్రమం


పార్వతీపురంటౌన్: కోర్టు ప్రాంగణంలో యోగాసనాలు వేస్తున్న జిల్లా రెండవ అదనపు జడ్జి ఎస్.దామోదరరావు


సాలూరు: కోర్టు ఆవరణలో యోగాసనాలు వేస్తున్న జడ్జి రమేష్, తదితరులు


బలిజిపేట: వెంగళరాయపురం పాఠశాలలో యోగాసనాలు వేయిస్తున్న ఉపాధ్యాయుడు ప్రసాద్


సీతానగరం: బూర్జ ఉన్నతపాఠశాల ఆవరణలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

పార్వతీపురంటౌన్: అంతర్జాతీయ యోగా దినోత్సవం పార్వతీపురం, సాలూరు నియోజకవర్గాల్లో శుక్రవారం ఘనంగా జరిగింది. ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో సూర్య యోగా కేంద్రం, పతంజలి యోగా కేంద్రం, బ్రహ్మ కుమారీ సంస్థ, ఇతర శిక్షణ కేంద్రాల సౌజన్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణు చరణ్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచంలో ప్రతి రంగంలో తీవ్ర పోటీ నెలకొందని, దాంతో మానసిక ఒత్తిడికి లోనవుతున్నారన్నారు. శారీరక శ్రమ తగ్గిందని అందువల్ల చిన్న వయస్సులోనే ఊబకాయం, మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధులకు గురవుతున్నారని, మానసిక ప్రశాంతతకు, శారీరక ఆరోగ్యానికి యోగా ఎంతగానో దోహదం చేస్తుందని తెలిపారు. యోగా ప్రాధాన్యతను గుర్తించి ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలు యోగాను జూన్ 21 తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకుంటున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయుష్ నోడల్ అధికారి డా.బి. సుశీల, జిల్లా రెవెన్యూ అధికారి జి. కేశవ నాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వై.సత్యం నాయుడు, బ్రహ్మ కుమారీ సంస్థ ప్రతినిధి పి.కె.జ్ఞానరత్నం, అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగాతో మనస్సు, శరీరం ఆరోగ్యవంతం

యోగాతోనే మనసు, శరీరం ఆరోగ్యకరంగా ఉంటాయని జిల్లా రెండవ అదనపు జడ్జి ఎస్.దామోదరరావు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో యోగాడేను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జె.సౌమ్య జోస్పినె, అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎన్. శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, యోగా గురువు ఎంవి. రాఘవేంద్ర, లాయర్లు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో..

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జిల్లా స్థాయిలో పెద్దబొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారిణి పగడాలమ్మ ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని గౌరి, ఏఎంఓ శ్రీనివాసరావు సమక్షంలో వ్యాయామ ఉపాధ్యాయుడు బి. శ్రీనివాసరావు యోగాసనాలు తాను వేస్తూ విద్యార్థులతో వేయించారు.

యోగాతో మానసిక ప్రశాంతత

సాలూరు: యోగాతో మానసిక ప్రశాంతత సాధ్యమవుతుందని సాలూరు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కె.రమేష్ అన్నారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు తాడ్డి తిరుపతిరావు ఆధ్వర్యంలో పట్టణంలోని కోర్టు ఆవరణలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొని యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పార్వతీపురంటౌన్: పెద్దబొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి పగడాలమ్మ


పార్వతీపురంటౌన్:ఎన్‌జీఓ హోంలో నిర్వహించిన కార్యక్రమంలో యోగాసనాలు వేస్తున్న ఐటీడీఏ పీఓ సి.విష్ణు చరణ్


సీతానగరం: ఆసనాలు వేయడాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ హేమాక్షి, యోగా ఇన్‌స్ట్రక్టర్లు


సాలూరు: ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో యోగాడే అక్షరమాలలో విద్యార్థినులు


పార్వతీపురం: బాలగుడబలో నిర్వహించిన యోగా కార్యక్రమం


సాలూరు రూరల్: యోగాసనాలు వేస్తున్న ఎంపీడీఓ కార్యాలయం సిబ్బంది.


పార్వతీపురంటౌన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగాసనాలు వేస్తున్న ప్రిన్సిపాల్ డా. చలపతి రావు

నీట్, నెట్ లీకుల బాధ్యులను శిక్షించాలి

- సీపీఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ

పార్వతీపురంటౌన్: నీట్, నెట్ పరీక్షా ప్రశ్నపత్రాల లీకులతో విద్యావ్యవస్థకు ప్రమాదమని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ, కమిటీ సభ్యుడు బి.సూరిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు పార్వతీపురంలోని సుందరయ్యభవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్, నెట్ అక్రమాల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రిగా కొనసాగే నైతిక అర్హత ధర్మేంద్ర ప్రధాన్ కోల్పోయారని, ఆయన తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ నిర్వహణలో ఘోర వైఫల్యానికి కారణమైన ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని రద్దు చేయాలని కోరారు. పరీక్షల నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) విఫలమైందని ఎద్దేవా చేశారు. ఎన్నో ఆశలతో ఏళ్ల తరబడి కష్టపడి చదివితే వారి భవిష్యత్ లీకులతో నాశనమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యమా లేక మరే కారణం ఉన్నా సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

జోగింపేటలో ఆక్రమణల తొలగింపు


ప్రభుత్వ స్థలాలను గుర్తిస్తున్న సర్వేసిబ్బంది, సర్పంచ్ సింహాచలం

సీతానగరం: మండలంలో రాష్ట్ర రహదారిని అనుకుని ఉన్న జోగింపేటలో ప్రభుత్వభూముల్లో ఆక్రమణలను తొలగించడానికి చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ కె.సింహాచలం అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రహదారిని అనుకుని రోజురోజుకు పుట్ట గొడుల్లా పుట్టికొచ్చినలే అవుట్ల కారణంగా భూముల ధరలు గణనీయంగా పెరగడం వల్ల ప్రభుత్వ స్థలాలు, కాలువలు, గెడ్డల కాలువలు అక్రమణకు గురైనట్లు తెలియజేశారు. ఈ నేపథ్యంలో అక్రమంగా ఆక్రమించుకున్న స్థలాలను ఖాళీ చేయించాలని తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పించిన వారం రోజుల్లోనే సర్వే సిబ్బంది ప్రభుత్వ స్థలాలను గుర్తించి ఆక్రమణలను తొలగించడానికి ఎల్లలు పాతడం ఆరంభించారని తెలియజేశారు. ప్రభుత్వ భూములను పరిరక్షించడానికి పంచాయతీ పరంగా సత్వర చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మూగజీవాల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- పశువైద్యాధికారి డాక్టర్ భోగి చక్రధర్


తాళ్లబురిడిలో గొర్రెలకు టీకాలు వేస్తున్న పశువైద్యులు

పార్వతీపురం టౌన్: మూగజీవాల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని పశువైద్యాధికారి డాక్టర్ బోగి చక్రధర్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మండలంలోని తాళ్లబురిడి గ్రామంలో పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలో ఎదురయ్యే వ్యాధులను నివారించేందుకు ప్రతి గ్రామంలో వ్యాధి నిరోధక టీకాలు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. గాలికుంటు, గొంతువాపు వ్యాధి మొదలగు టీకాలను వివిధ దశలలో వేస్తున్నామని చెప్పారు. సీజనల్ వ్యాధులపట్ల రైతులు అప్రమత్తంగా ఉండి పాడి సంపదను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. పాడి రైతులంతా మూగజీవాల్లో వచ్చే వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని హితవు పలికారు. కార్యక్రమంలో గ్రామ పశువైద్యులు అరసాడ లలిత, పాడి రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బలిజిపేట: మండలంలో శనివారం విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ నిర్వహించనున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని దీనిని వినియోగదారులు గమనించి సహకరించాలని ఏఈ సింహాచలం కోరారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, అవకాశం ఉంటే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయనున్నామ తెలిపారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

- మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్


పట్టణంలోని వేమకోటివారి వీధిలో పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

పార్వతీపురం టౌన్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పట్టణంలోని 26వ వార్డు వేమకోటి వారి వీధి, కొత్తవలస మెయిన్ రోడ్లలో డ్రైన్ క్లీనింగ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో వర్షపునీరు రహదారిపై, వార్డుల్లో నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టామని తెలిపారు. అందులో భాగంగా పార్వతీపురం పట్టణంలో గల 30 వార్డుల్లో డ్రైన్ క్లీనింగ్ చేపడుతున్నామన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి వార్డులో క్లోరినేషన్, బ్లీచింగ్ చల్లడం చేపడుతున్నామన్నారు. ప్రజలంతా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని హితవు పలికారు. వార్డుల్లో వర్షపునీరు నిల్వలేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మురళి, శానిటేషన్ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ పాఠశాల సందర్శన


పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ సామల సింహాచలం

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మున్సిపాలిటీ పరిధిలో గల ఠాగూర్ మున్సిపల్ పాఠశాలను ఎంఈఓ సామల సింహాచలం శుక్రవారం సందర్శించారు. విద్యార్థులందరికీ స్టూడెంట్ కిట్స్ అందజేశారా? లేదా అన్న విషయాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు చేతి రాతను చక్కగా నేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులతో తెలుగు, ఆంగ్ల పాఠ్యాంశాలను చదివించి, భాషా పఠన సామర్థ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక శ్రద్ధతో బోధించాలని, విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల వద్ద విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన మంచినీటి వసతి, టాయిలెట్స్ తదితర సౌకర్యాలు పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగేశ్వరరావు, సహోపాధ్యాయులు, సీఆర్ఎంటీ పి.ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

యోగాసనాలు వేసిన వేతనదారులు


మక్కువ: యోగాసనాలు వేస్తున్న ఉపాధి వేతనదారులు

మక్కువ: మండలంలోని చప్పబుచ్చమ్మపేట, శంబర, కాశీపట్నం, కన్నంపేట, మార్కొండపుట్టి, కొయ్యానపేట గ్రామాల్లో ఎంపీడీవో పి.దేవకుమార్ ఆధ్వర్యంలో ఉపాధి వేతనదారులు శుక్రవారం ఘనంగా యోగా దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో పనిప్రదేశాల వద్ద, అమృత్‌సరోవర్ చెరువుల వద్ద ఉపాధి వేతనదారులు యోగా దినోత్సవం సందర్భంగా ఆసనాలు వేశారు. కార్యక్రమంలో ఏపీవో ఈశ్వరమ్మ, ఈసీ వెంకటలక్ష్మి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వేతనదారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తం

- ఎల్‌డీఎం మూర్తి


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎల్‌డీఎం మూర్తి

సాలూరు: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎల్‌డీఎంజీఎల్ఎస్ మూర్తి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పాచిపెంట మండలంలోని పి.కోనవలస గిరిజన గురుకుల బాలుర కళాశాలలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, డిపాజిట్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ వర్క్‌షాప్‌కు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల నుద్దేశించి ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ బ్యాంక్ ఖాతా కలిగి ఉండాలన్నారు. ప్రస్తుత సమాజంలో ఆన్‌లైన్ మోసాలు అధికంగా జరుగుతున్నాయని తెలిపారు. ఏ విధంగా మోసాలు జరుగుతున్నాయి? వాటిని ఎలా అరికట్టాలో? అవగాహన పెంపొందించారు. బ్యాంకింగ్ సేవలు, డిపాజిట్ ఖాతాలు తదితర అంశాల గురించి మాట్లాడారు. పై అంశాలపై అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పిన పలువురు విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌లు హరిబాబు, ఫణికుమార్ వైస్‌ప్రిన్సిపాల్ వసంతరావు, ఏపీజీవీబీ బీఎం మన్మథరావు, ట్రైనర్లు కృష్ణకిశోర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.